హ్యాపీ హోమ్స్‌లో సమస్యలు పరిష్కరించండి



హ్యాపీ హోమ్స్‌లో సమస్యలను పరిష్కరించాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న స్థానికుడు

బండ్లగూడ,నవంబర్ 4: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హ్యాపీ హోమ్స్‌లో సమస్యలను పరిష్కరించాలని స్థానిక నాయకుడు సయ్యద్ ముజమీల్ అహ్మద్ ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హ్యాపీ హోమ్స్‌లో విద్యుత్ దీపాలు,గుంతల మయంగా మారిన రోడ్లు,అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.అధికారులు వెంటనే చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

రేపు చలో తుక్కుగూడ

ఎంజేఎఫ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి శివకుమార్ మాదిగ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంజేఎఫ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి శివకుమార్ మాదిగ

శంషాబాద్ రూరల్, నవంబర్ 4 : చలో తుక్కుగూడను విజయవంతం చేయాలని ఎంజేఎఫ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి శివకుమార్ మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం శంషాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చలో తుక్కుగూడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. మాదిగల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం వారికి అన్యాయం చేస్తుందని ఆరోపించారు. ఈ నెల 6న తలపెట్టిన చలో తుక్కుగూడ సభను విజయవంతం చేసి సీఎం రేవంత్‌రెడ్డి గుండెలు అదిరేలా చేయాలని సూచించారు. తెలంగాణలోని మాదిగ సోదరులు లక్షలాదిగా తరలి రావాలన్నారు. సమావేశంలో ఎంజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు భానుప్రసాద్, శంషాబాద్ అధ్యక్షుడు మహేష్,సిద్ధు, అఖిల్,పవన్, సాయి, ధరణి, వర్ష, రేవతి, శ్రీచరణ్, కళ్యాణ్,కుమార్ పాల్గొన్నారు.

కృష్ణానగర్ పెద్దయ్య పిండి గిర్ని ముందు చెత్త రిక్షాలో, ఆ సమీపంలో పేరుకుపోయిన చెత్త

అధికారులు..వీధుల్లో చూడండి

- రోడ్లపై దుర్గంధం
- వెదజల్లుతున్న వ్యర్థాలు..
- ఈగలు, దోమలతో ఇబ్బందులు

జూబ్లీహిల్స్, నవంబర్ 4: యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లో 'చెత్త'.. సేకరణ అస్తవ్యస్థంగా మారింది. రోజులతరబడి రోడ్లపై పేరుకుపోతున్న వ్యర్థాలు, దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఇండ్లముందు చెత్త కుప్పలతో ఈగలు, దోమలు ముసురుతున్నాయి. జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ పరిధిలోని శ్రీకృష్ణానగర్‌లోని పలు ప్రాంతాలలో ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరుగకపోవడంతో రోడ్లపై ఎప్పటిలా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. గతంలో డంపర్ బిన్‌లు సమూలంగా తొలగించి గార్బేజ్ వనరబుల్ పాయింట్లతో చెత్త సేకరణ చేపట్టిన శానిటేషన్ అధికారులు ఇటీవల జీవీపీలు పూర్తిగా తొలగిస్తున్నామని చెప్పారు. అయితే రోడ్లపై జీవీపీలు పూర్తిగా తొలగించకపోగా ఆయా పాయింట్‌ల నుంచి తెల్లవారు జామున తరలించాల్సిన చెత్తను ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగిస్తున్న సమయంలో రోడ్లపై భారీ వాహనాలతో లిఫ్ట్ చేస్తుండడం అసౌకర్యానికి గురిచేస్తుంది. కృష్ణానగర్ పెద్దయ్య పిండి గిర్ని ముందు దీపావళి నుంచి రిక్షాలో నిండిపోయిన చెత్తతో పాటు రోడ్డుపై పేరుకుపోయిన చెత్త నేటికీ తీయలేదని స్థానికులు తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని ఇంటింటి చెత్త సేకరణ పకడ్బందీగా చేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు, షూస్ పంపిణీ

క్రీడా దుస్తులు, షూస్ అందుకున్న విద్యార్థులతో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ప్రెసిడెంట్ బాలకోటిరెడ్డి తదితరులు

జూబ్లీహిల్స్,నవంబర్ 4 : పేద విద్యార్థుల విద్య, క్రీడాభ్యున్నతికి అవసరమైన సహకారం అందిస్తామని రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ప్రెసిడెంట్ బాల కోటిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాలపురం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పూర్వ విద్యార్థి కేతిరెడ్డి రమణా రెడ్డి సహకారంతో 100 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు, షూస్ పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరాలతో పాటు పేద విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్‌లు ఝాన్సీ, మహేందర్ రెడ్డి, శ్యామ్, రమణారెడ్డి, అమరేందర్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్, జడ్పీ హెచ్‌పీ హెచ్ఎం బోయిని తిరుపతి, జి.సందీప్ రెడ్డి, ఉపాధ్యాయులతో పాటు ఎస్ఎంసీ చైర్‌పర్సన్ పసుల కావ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

శివపురి కాలనీలో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ లావణ్య

మణికొండ, నవంబర్ 4: ప్రజలకు మెరుగైన సదుపాయాల కల్పనకు తమవంతు బాధ్యతగా కృషి చేస్తున్నామని కౌన్సిలర్ యాలాల లావణ్య తెలిపారు. మణికొండ మున్సిపాలిటీ శివపురి కాలనీలో సోమవారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పనులను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నామన్నారు. ప్రజలు అభివృద్ధి పనులకు తమ పూర్తి సహకారం అందించాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు దేవేందర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం



ఈఎస్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ నాయకుడు జంపుల భగవాన్‌దాస్‌ను పరామర్శిస్తున్న యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 4: బీఆర్ఎస్ పార్టీ ప్రతి నాయకుడు, కార్యకర్తకు అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మోహన్‌రెడ్డినగర్ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు జంపుల భగవాన్‌దాస్ సనత్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రిలో థైరాయిడ్ గడ్డతో బాధపడుతూ చికిత్స పొందుతున్న నేపథ్యంలో సోమవారం నాయకులతో కలిసి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా జంపుల భగవాన్‌దాస్ బాగోగులను ఈఎస్ఐ ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ రాధికను అడిగి తెలుసుకున్నారు. పార్టీ భగవాన్‌దాస్‌కు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్, కొంపల్లి జగదీష్, అశోక్‌కుమార్, కార్తీక్ ముదిరాజ్ తదితరులున్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో సత్తాచాటిన క్రీడాకారులు

మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 4: ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదపడతాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర లెవల్ విష్యూ ఛాంపియన్‌షిప్-2024 లో మైలార్‌దేవ్‌పల్లిలోని మహవీర్ విష్యూ మార్షల్ ఆర్ట్స్‌కు చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈ నెల 2 నుంచి 4 వరకు మహబూబ్‌నగర్‌లోని జిల్లా పరిషత్ కేసముద్ర పాఠశాలలో నిర్వహించిన ఛాంపియన్‌షిప్‌లో జయవర్ధన్ 56 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, సంగమేశ్ 48 కేజీల విభాగంలో బ్రోంజ్ మెడల్, శ్రీశాంత్ 52 కేజీల విభాగంలో బ్రోంజ్ మెడల్, సాయిచరణ్ 60 కేజీల విభాగంలో బ్రోంజ్ మెడల్, అనన్య 56 కేజీల విభాగంలో బ్రోంజ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా సోమవారం టి.ప్రకాశ్‌గౌడ్ పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోచ్ సంతోష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భూదాన్ భూములను పేదలకు పంచాలి

హిమాయత్‌నగర్,నవంబర్ 4: రాష్ట్రంలోని భూదాన్ భూములను పేదలకు పంచాలని కోరుతూ నేడు(మంగళవారం) హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈ.టీ.నరసింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.అన్యాక్రాంతమైన భూదాన్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు.హైకోర్టు రిటైర్డ్ జడ్జిలు చంద్రయ్య, చంద్ర కుమార్,డాక్టర్ ఎస్.అవులప్ప,ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు. సీపీఐ పార్టీ శ్రేణులు ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి అధిక సంఖ్యల్లో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ

మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ సుష్మారెడ్డి

శంషాబాద్ రూరల్, నవంబర్ 4 : మున్సిపల్ కార్మికులకు సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. శంషాబాద్ మున్సిపల్ కార్మికులకు స్థానికంగా ఉన్న సంత్ శ్రీఆశారామ్‌జీ ఆశ్రమం వారి ఆధ్వర్యంలో దీపావళి సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ చేతుల మీదగా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు ప్రతి రోజూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచడం కోసం ఎంతో పనిచేస్తారని అలాంటి వారికి దుస్తులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.
మున్సిపాలిటీ నుంచి కార్మికులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య, కార్మికులు ఆశ్రమం ప్రతినిధులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సుబ్రమణ్యం కాలనీలో కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ సోమవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటో డివిజన్ పరిధిలోని కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు రమేష్ మంద,మహేష్‌కుమార్,కొండల్‌రావు,పద్మారెడ్డి,శ్రీకాంత్‌బిల్లపాటి,ఫణికుమార్, కిశోర్, మురళి,రాజేష్‌ఖన్నా,సురేందర్,అరుణ్ తదితరులు పాల్గొన్నారు. – బండ్లగూడ

ప్రజలకు అసౌకర్యం కలుగకుండా అభివృద్ధి పనులు

ప్రజలకు అసౌకర్యం కలుగకుండా అభివద్ధి పనులు చేపట్టాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం రహ్మత్‌నగర్ డివిజన్ కార్మికనగర్‌లో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఏఈ భరత్‌తో కలిసి పరిశీలించారు. ఎన్నో ఏండ్లుగా అసౌకర్యంగా ఉన్న ఈ రోడ్డు పనులను వేగవంతంగా చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తొలగించిన అధికారులను అభినందించారు. – జూబ్లీహిల్స్,నవంబర్ 4

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 4: మైలార్‌దేవ్‌పల్లి, గ్రీన్ విచ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11 నుంచి 12.30 వరకు క్రిస్టల్ టౌన్, మొగల్ కాలేజ్, రహమత్ కాలనీ, సుభాన్ హిల్స్, రాయల్ సీ హోటల్ ప్రాంతం, వాదేయి పహరాన్, అబ్దుల్లా కాలనీ, పటేల్ నగర్, న్యూరినగర్, తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

22 సెల్‌ఫోన్లు చోరీ

హిమాయత్‌నగర్,నవంబర్ 4: సదర్ ఉత్సవాలను వీక్షించేందుకు వచ్చిన పలువురి సెల్‌ఫోన్లు చోరీకి గురైన ఘటన నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి నారాయణగూడలోని వైఎంసీఏ చౌరస్తాలో జరిగిన సదరు ఉత్సవాలను వీక్షించేందుకు అధిక సంఖ్యల్లో ప్రజలు వచ్చారు. దున్నపోతుల విన్యాసాలను మైమరిచి చూస్తుండగా ఇదే అదునుగా భావించి, జనం రద్దీగా ఉన్న ప్రాంతాలలో దుండగులు 22 సెల్‌ఫోన్లను తస్కరించారు.బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు డీఐ నాగార్జున తెలిపారు.

చెడు వ్యసనాలకు
దూరంగా ఉండాలి

కందుకూరు, నవంబర్ 4 : విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కందుకూరు పోలీస్ స్టేషన్ సీఐ సీతారాం అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాంటీడ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకావద్దని కోరారు. డ్రగ్స్ వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎం తో మంది సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకొని జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ఎస్ఐ సైదులు, ప్రిన్సిపాల్ మహరా జు, లెక్చరర్లు పర్వతాలు పాల్గొన్నారు.

రేపటి నుంచే.. సమగ్ర కుటుంబ సర్వే

యూసుఫ్‌గూడలో అదనపు సిబ్బందికి కొనసాగుతున్న శిక్షణ

శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు సిబ్బంది, శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్, కార్యక్రమంలో డీసీ, డీపీఓ తదితరులు

జూబ్లీహిల్స్,నవంబర్ 4 : రేపటి నుంచి చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సోమవారం యూసుఫ్‌గూడ సవేరా ఫంక్షన్‌హాల్‌లో డీసీ జాకియా సుల్తానా ఆధ్వర్యంలో అదనపు సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 690 ఎన్యుమరేషన్ బ్లాక్‌లకు 700 మంది సిబ్బందిని నియమించి శిక్షణ ఇచ్చారు. ఒక ఎన్యుమరేషన్ బ్లాక్‌లో సంబంధిత ఎన్యుమరేటర్ 150 ఇండ్లను సర్వే చేయాల్సి ఉంది. కాగా ఆయా ఈబీలలో సర్వే చేయాల్సిన గృహాల సంఖ్య పెరిగితే ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అదనంగా మరో 100 మంది సిబ్బందిని కేటాయించి శిక్షణ ఇస్తున్నారు. ఆయా సిబ్బందికి మంగళవారం కూడా శిక్షణ కొనసాగుతుందని సమగ్ర సర్వే అధికారి, డీపీఓ వెంకటకిషన్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ భానుచందర్, ఎస్ఎస్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాసంలో తొలి సోమవారం సందర్భంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ ప్రాంతాల్లోని శివాలయాన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. శ్రీనగర్ కాలనీలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా విశేష అభిషేకాలు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1లోని శివాలయంలో ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అభిషేకం నిర్వహించారు.

వన్ టైమ్ సెటిల్‌మెంట్‌ను
సద్వినియోగం చేసుకోవాలి

ఈనెల 31 వరకు గడువు పొడగింపు

జూబ్లీహిల్స్,నవంబర్ 4: జలమండలి వినియోగదారులు పెండింగ్ బకాయిలు చెల్లించేందుకు మరో నెల రోజులపాటు ఓటీఎస్ పథకాన్ని పొడిగించారు. ఇందులో భాగంగా పెండింగ్‌లో ఉన్న నీటి బిల్లులు చెల్లించేందుకు 100 శాతం వడ్డీ మాఫీ చేస్తున్నారు. ఈ పథకం గడువు నవంబర్ 31 వరకు పొడిగించినందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పాత బకాయిలు చెల్లించాలని అధికారులు కోరుతున్నారు. బీపీఎల్ వినియోగదారులు మినహాయించి ఓటీఎస్ పథకానికి అర్హులైన వినియోగదారులకు పెండింగ్ బకాయిలలో వడ్డీతో పాటు లాస్ట్ పేమెంట్ పెనాల్టీలు, మీటర్ పెనాల్టీలు పూర్తిగా మాఫీ చేసి ఈ పథకాన్ని అమలుచేస్తున్నారు. దీనిలో భాగంగా వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని పాత బకాయిలు వెంటనే చెల్లించాలని జలమండలి జీఎం ఎస్.హరిశంకర్ కోరారు. మరిన్ని వివరాలకు స్థానిక జలమండలి కార్యాలయాలతో పాటు 155313 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

కందుకూరు : కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్ సూచించారు. కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని వైస్ చైర్మన్ గోపీరెడ్డి విజేందర్‌రెడ్డి, డైరెక్టర్లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ దళారుల ప్రమేయం లేకుండా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు ధర రూ. 2,320 వేలు, ప్రభుత్వం చెల్లిస్తున్న రూ. 500 బోనస్‌ను కలుపుకొని రూ. 2,820 చెల్లిస్తామని తెలిపారు.

ముదిరాజ్‌లకు అన్ని రంగాల్లో..
సముచిత స్థానం కల్పించాలి

హైదర్‌గూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న చొప్పరి శంకర్ ముదిరాజ్

హిమాయత్‌నగర్,నవంబర్ 4: రాష్ట్రంలోని ముదిరాజ్ సామాజిక వర్గానికి అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదర్‌గూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుకూలంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వాటాను తేల్చేందుకు డెడికేషన్ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు దాటినా ముదిరాజ్ ఎమ్మెల్యేకు మంత్రి వర్గంలో చోటు కల్పించకపోవడం దారుణమన్నారు.జనాభా దామాషా ప్రకారం ముదిరాజ్‌లకు ప్రభుత్వంలో,కార్పొరేషన్ చైర్మన్లు,ఎమ్మెల్సీ పదవులలో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ఈ సమావేశంలో టీ.మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మద్దెల సంతోష్ ముదిరాజ్,ఉపాధ్యక్షుడు సుధాకర్, ప్రతినిధులు గొడుకు శ్రీనివాస్ ముదిరాజ్,ప్రణీత్,శివ శంకర్ పాల్గొన్నారు.

ఎంజీవిటీ కళాశాల స్పెషల్ క్యాంప్

మహరాజ్‌పేట్ గ్రామస్తుల వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

మణికొండ, నవంబర్ 4: మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ సహకారంతో మహరాజ్‌పేట్ గ్రామంలో స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ క్యాంప్ ఆ గ్రామంలో వారం రోజుల పాటు కొనసాగుతుందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.బాల్‌రెడ్డి వివరించారు. దానిలో భాగంగా ఈ స్పెషల్ క్యాంప్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్ రెడ్డి సోమవారం 50 మంది విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో వారం రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో రోజుకు ఒక సామాజిక అంశం ద్వారా ఎంతో నేర్చుకుంటారని తెలిపారు. మొదటి రోజు గ్రామంలో జన జీవనం ఎలా ఉంది, వారి ఆర్థిక అవసరాలకు ఏ విధంగా పని చేస్తున్నారు అనే అంశం మీద క్యాంప్ కొనసాగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసులకు దొంగను
పట్టించిన ఆటోడ్రైవర్

వెంగళరావునగర్, నవంబర్ 4 :చిరునామా అడిగినట్లు నటిస్తూ..మొబైల్ ఫోన్ లాక్కొని పరారవుతున్న ఇద్దరు దొంగల్లో ఒక దొంగను ఆ ఆటో డ్రైవర్ ధైర్య సాహసాలతో పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. పోలీసుల కథనం ప్రకారం..బోరబండ అల్లాపూర్‌కు చెందిన చీకటి అక్షయ్ కుమార్ (27) ఆటో డ్రైవర్. రోజూలానే అమీర్‌పేట్ మైత్రీవనం వద్ద ఆటోను పార్కింగ్ చేసి..ప్రయాణికుల కోసం వేచి ఉన్నాడు. ఆ సమయంలో యాక్టివా బైక్ పై పంజగుట్ట వైపు నుంచి ఇద్దరు వ్యక్తులు వచ్చారు. చిరునామా అడిగినట్లు నటిస్తూ..ఆటో డ్రైవర్ అక్షయ్ చేతుల్లోని సెల్ ఫోన్ లాక్కున్నారు. దొంగలిద్దరూ బైక్ పై పారిపోతుండగా..వారిద్దర్నీ తోటి ఆటో డ్రైవర్ చరణ్‌తో కలిసి లాగేశాడు. దీంతో వారిద్దరూ కింద పడిపోయారు.

దొంగల్లో ఒకడిని ఆటో డ్రైవర్ పట్టుకున్నాడు. తప్పించుకునేందుకు యత్నించగా..ఓ దొంగను పట్టుకుని డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో తన పేరు నవీన్ అని..తనతో పాటు వచ్చిన సహచరుడు పేరు రోహన్ అని వెల్లడించారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.